రోడ్డు దుర్భరం.. నడక నరకం

- ఏళ్లుగా రహదారి' కష్టాలు
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపై లేచిన కంకర


కచ్చా రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

కెరమెరి: మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నిషాని, లైన్‌గూడ గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలతో బురదమయంగా మారి కనీసం నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ 254 కుటుంబాలు ఉండగా 1,108 మంది జనాభా ఉన్నారు. గ్రామస్తులు చిన్న పని ఉన్నా కెరమెరి మండల కేంద్రానికి వస్తుంటారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో మండల కేంద్రానికికి వచ్చే వారికి నిత్యం నరకం కనిపిస్తుంది. ఈ విషయమై గతంలో అధికారులకు, నాయకులకు విన్నవించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మోకాళ్లలోతు బురద

కెరమెరి నుంచి నిసాని వెళ్లే దారిలో ఇందాపూర్ వరకు బీటీ రోడ్డు ఉంది. కానీ అక్కడ నుంచి నిసాని గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. గతంలో దేవుడ్‌పల్లి పునరావాస కేంద్రం కోసం కిలోమీటరు వరకు బీటీరోడ్డు నిర్మించినప్పటికీ ఆ తర్వాత నాలుగు కిలోమీటర్లు నడక దుర్భరంగా మారింది. పొలాల మధ్య ఉన్న కచ్చారోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారింది. ఎక్కడికక్కడ గుంతల పడి.. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ రోడ్డుపై కనీసం పాదాచారులు కూడా నడవలేని దుస్థితి ఉంది. గ్రామానికి కొద్ది దూరం వరకు గతంలో కంకర రోడ్డు వేశారు. ఇప్పుడు ఆ కంకర లేచి ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కచ్చా రోడ్డుతో అనేక కష్టాలు పడుతున్నాం. బీటీ రోడ్డు వేయాలని గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పి అలసిపోయాం. కానీ నేటికీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ప్రతీ అవసరానికి కెరమెరికి వెళ్లక తప్పడం లేదు. అధికారులు స్పందించి బీటీ వేయాలి.

– చహకటి దాము, గ్రామ పటేల్, నిసాని

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



నిషాని, లైన్‌గూడ గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం లేని విషయం వాస్తవం. వానాకాలం మినహా ఇతర కాలాల్లో పెద్దగా ఇబ్బందులు ఉండవు. గ్రామస్తుల సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అప్పటి వరకు తాత్కాలిక చర్యలు తీసుకుంటాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

క్లుప్తంగా

4న కాగజ్‌నగర్‌కు 'మందకృష్ణ'


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణానికి ఆగస్టు 4న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని గోవర్ హెట్టి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. మందకృష్ణ మాదిగ కార్యక్రమానికి వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విఠల్, రాజేశ్, బాబురావు, నానాజీ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌లో గల గిరిజన పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహాన్ని గురువారం ఎంపీడీవో కోట ప్రసాద్ తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. 50 మంది విద్యార్థులకు 30 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు గమనించిన ఆయన మిగితా విద్యార్థులు కూడా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్ వెంకటేశ్వర్‌కు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం కూరగాయాలు, వంట సామగ్రి, ఆర్వో ప్లాంట్ పనితీరు పరిశీలించారు. సోలార్ నీటి హీటర్ చెడిపోయినందున చల్లని నీటితో స్నానం చేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సోలార్ హీటర్ పని చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు వానాకాలంలో విద్యుత్ మోటర్ల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఈ శేషారావు అన్నారు. గురువారం మండలంలో ఎల్లారం గ్రామంలో వ్యవసాయ మోటార్లతో సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ మోటార్లు ఆన్, ఆఫ్ చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ ఫిరోజ్, ఏఈ ఉర్మిల, లైన్‌మెన్ రాజ్‌కుమార్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపెల్లికి నైట్ బస్‌సర్వీస్ ప్రారంభించాలని వినతి

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఎటపెల్లికి జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ నైట్ బస్ సర్వీస్ ప్రారంభించాలని ఎటపెల్లి కౌన్సిలర్ రాఘవేంద్ర రాజ్‌పాల్ గురువారం డీఎం రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. మహారాష్ట్రలోని అహేరి, అలాపెల్లి, ఎటపెల్లి, బామ్రాగ్ ప్రాంతాల్లో తెలుగు ప్రజలు అధికంగా ఉండడంతో వివిధ అవసరాల కోసం జిల్లాకు వస్తుంటారని, రాత్రి సర్వీసును ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, ఈజ్‌గాం, కదంబ చింతలమానెపెల్లి, గూడెం మీదుగా ఎటపెల్లికి నడిపితే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని వివరించారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్, మృతి చెందిన ఉద్యోగుల వారసులకు గోలేటి టౌన్‌షిప్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన నలుగురు, మృతి చెందిన ఒక ఉద్యోగి వారసులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులను కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీవైపీఎం రాజేశ్వర్‌రావులు ప్రశ్నించి ధ్రువపత్రాలు పరిశీలించారు. కైరిగూడ మేనేజర్ శంకర్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి ఎనిమిది మంది విద్యార్థులను ఎంపిక చేశామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరంలో మిగిలి ఉన్న ఎనిమిది సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసి అడ్మిషన్ పత్రాలు అందించామని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ

వాంకిడి: నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ చేపడుతున్నట్లు సీఐ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లి జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించి వాహనాల ధ్రువ పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్‌లు లేని 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రజలు నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఎస్సై ప్రశాంత్, ఆసిఫాబాద్ ఎస్సైలు కొమురయ్య, శ్యాంరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

కెరమెరి: ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. గురువారం మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. వంటగదిని పరిశీంచారు. తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. శుభ్రంగా కడిగి పోషక విలువలు కలిగిన వంటలను విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. వంటగదులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్తచెదారం గదుల సమీపంలో ఉండకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం మోతీరాం ఉన్నారు.

కిచెన్ గార్డెన్ కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న పద్మాకర్

కెరమెరి: మండలంలోని సాకడ, మెట్టపిప్రి గ్రామాల్లో సెంటర్ ఫర్ అక్వాటిక్ లౌలీహుడ్ జలజీవిక సంస్థ ఆధ్వర్యంలో హెర్బల్ లైఫ్ సంస్థ సహకారంతో గురువారం సేంద్రియ ఉత్పత్తిదారుల కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు కిచెన్ గార్డెన్ కిట్లను సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బొజ్జ పద్మాకర్ పంపిణీ చేశారు. ఉచితంగా పంపిణీ చేసిన కిట్టులో 9 రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయని, ఇంటి ఆవరణలో కూరగాయలు పెంచుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేంద్రియ ఉత్పత్తులతో భూసారం పెరుగుతుందన్నారు. కేంద్రె బాలాజీ, రాంచందర్, కుమురం న్యానేశ్వర్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


కౌటాల: చెక్కు అందజేస్తున్న హరీశ్‌బాబు

సిర్పూర్(టి): ప్రతీ ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి డౌనల్ వరకు ఉన్న సీసీరోడ్డు, బస్టాండ్ ప్రాంతం నుంచి సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారులను పరిశీలించారు. తహసీల్దార్ రహీముద్దిన్, ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కౌటాల రైతువేదికలో లబ్ధిదారులకు గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదంటి ఆడబిడ్డల పెళ్లికి అండగా ఉండడానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలు సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కుంచాల విజయ్, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, నాయకులు బండురావ్, సత్తయ్య, అశోక్, భూమయ్య, రవి, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


జిల్లాకేంద్రంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువ నాయకులు కోవ సాయినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జీవన్, పోచయ్య, రవీందర్, అన్సార్, భీమేష్, గోపాల్, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, ఆకాష్, లక్ష్మణ్, ఆశన్న, చందు, కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పెందోర్ మోతిరాం, అబ్దుల్ కలాం, సెడ్మకి దుర్వత బాయి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్‌చైర్మన్ మహేశ్‌గౌడ్, పోషమల్లు, శ్యాంరావు భరద్వాజ్, శ్రీధర్, ఆనంద్‌రావు, వినోద్‌జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం కేటీఆర్ జన్మదిన వేడుకలను టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మాల్రాజ్ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, యూనియన్ సెంట్రల్ నాయకులు మాంత్ సమ్మయ్య, ఏరియా నాయకులు చందర్, జూనియర్ తిరుపతి, విద్యాసాగర్, చిరంజీవి, సంజీవ్, రవి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: బీఆర్ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. మండల మహిళా కన్వీనర్ మమత, నాయకులు నాందేవ్, సోమయ్య, ప్రకాశ్, సందీప్, ఆనంద్, జనార్ధన్, ఆత్మరాం, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి


కౌటాల: మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల పఠన నైపుణ్యం పెంచాలన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్ఎంలు నారాయణ్‌సింగ్, నానాజీ, సీఆర్పీలు ప్రకాశ్, దేవన్న, లాలాజీ, సిబ్బంది సుమన్, లూలాజీ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెంపొందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తిని ఉపాధ్యాయులు పెంపొందించాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. గురువారం ఎమ్మార్సీ భవనంలో మండలస్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో లైబ్రరీని నిర్వహించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ అమలు పరిస్థితిని సమీక్షించారు. పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జాడి దేవాజీ, అనురాధాబాయి, ప్రమీల, వెంకటనర్సయ్య, చంద్రశేఖర్, మండల రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెజ్జూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులతో పాటు ఆర్వో ప్లాంట్, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. స్టాక్ వివరాలపై ఆరా తీశారు. ఎంపీఈవో గౌరీ శంకర్, ఏపీవో రాజన్న, సీనియర్ అసిస్టెంట్ సోయల్ అహ్మద్, కార్యదర్శి వైకుంఠం ఉన్నారు.

తగ్గని వర్షం.. పొంగిన వాగులు


ఉప్పొంగి ప్రవహిస్తున్న సుస్మీర్ ఒర్రె

బెజ్జూర్: మండలంలో గురువారం సైతం వర్షం దంచి కొట్టింది. దీంతో మండల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, ఒర్రెలు పొంగిపొర్లుతుండడంతో మండలంలోని 12 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కాగా పంట పొలాలు నీట మునిగాయి.

రోడ్డు కోతతో తిప్పలు!


కోతకు గురైన బీటీ రోడ్డు

కెరమెరి: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షం వల్ల పాట్నాపూర్, జోడేఘాట్ మధ్యలో ఉన్న బీటీ రోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు పూర్తిగా మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదభరితంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జోడేఘాట్ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రావుల వినోద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమోద్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. విద్యారంగంలో యన్‌జీవోల జోక్యాన్ని నివారించాలని, అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్లు విడుదల చేయాలని పేర్కొన్నారు. డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతీ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, విలాస్, బాపురావు, విజయ్‌కుమార్, సాయికుమార్, తిరుపతి, చంద్రశేఖర్, రావుజీ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చింతలమానెపల్లి: పాఠశాల విద్య, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బుర్రా మహేందర్, కార్యదర్శి విఘ్నేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని, పీఆర్సీ ప్రకటించి వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజన్న, సచిన్, లక్ష్మీనారాయణ, కృణాల్, రవి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ అడ్డుకుందాం'

రెబ్బెన: ఆంధ్రప్రదేశ్ జలదోపిడీని అడ్డుకుందామని బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ఎండీ ముస్తఫా, ఓయూ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు వైరగడే రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బనకచర్ల ప్రాజెక్టుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి జరిగే నష్టాన్ని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రపూరితంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు దుర్గం భరద్వాజ్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు శ్రీధర్, ఆనంద్‌రావు, భుజంగరావు, సాగర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం..!



చింతలమానెపల్లి: అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంలా మారుతోంది. అసంపూర్తి వంతెనలు ఇందుకు నిదర్శనంలా కనిపిస్తున్నాయి. మండలంలోని బాబాసాగర్, నాయకపుగూడ గ్రామాల మధ్య గల వాగు వర్షాకాలం వచ్చిందంటే ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుకు ఆవలివైపున బాబాసాగర్ పంచాయతీ నాయకపుగూడ గ్రామం ఉండగా గ్రామస్తులకు ఇరువైపులా పంటభూములు ఉన్నాయి. బుధవారం వాగు ఉధృతితో ప్రవహించగా గురువారం కాస్త తగ్గుముఖం పట్టింది. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులకు పంట భూములకు తప్పక వెళ్లాల్సిన పరిస్థితి. ప్రమాదమే అయినప్పటికీ తప్పక ఎడ్లబండ్లపై రైతులు వాగు దాటుతున్నారు. ఓవైపు అసంపూర్తిగా ఉన్న వంతెన వెక్కిరిస్తూ కనిపిస్తుండగా రైతులు తమ పరిస్థితి ఇంతే అనుకుంటూ వాగు దాటుతుండడం గమనార్హం.

ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ప్రారంభం


విద్యుత్ దీపాలు ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో దస్నాపూర్ గ్రామంలో గురువారం ఎంపీ నిధులతో మంజూరైన ఎల్ఈడీ విద్యుత్ దీపాలను బీజేపీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్ రావు ప్రారంభించారు. దస్నాపూర్‌లో గతంలో పర్యటించినప్పుడు గ్రామంలో ఎల్ఈడీ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ దృష్టికి తీసుకురావడంతో ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, దీపక్, ప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.